క్లుప్తంగా

పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి

మరికల్: భూ గర్భజలాలు తగ్గడంతో వరి పంటలకు సాగునీరు లేక ఎండిన పంటలను పరిశీలించి నష్ట పరిహారం చెల్లించాలని బీజేపీ మండల నాయకులు శ్రీరామ్, రమేష్, వేణు, రాము అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వ్యవసాయ బోర్లలో నీటి తగ్గడంతో అక్కడక్కడ రైతులకు చెందిన వరిపంటలు ఎండిపోతున్నాయి. ఎకరాకు రూ. 20వేలకు పైగా పెట్టుబడులు పెట్టగా పంట చేతికొచ్చిన సమయంలో నీరు లేక పంటలు బీడుగా మారుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వ్యవసాయశాఖ నష్ట పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఆంజనేయులు

మరికల్: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కాటికొండ ఆంజనేయులను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన నియామక ప్రతాన్ని అందుకున్నారు. అనంతరం నూతన యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ.. రాబోయే లోకసభ ఎన్నికల్లో మరికల్ మండలం నుంచి భారీ మేజార్టీ వచ్చేలా కృషి చేస్తామన్నారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్ రెడ్డి, జిల్లా నాయకులు సూర్యమోహన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ క్లస్టర్‌లో ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ సాయినాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కోటకొండ చుట్టు పక్కల గ్రామాలు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు బొమ్మన్‌పాడు, బండగొండ తదితర గ్రామాల్లో విద్యుత్‌కోతలు ఉంటాయన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు



నారాయణపేట: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో పేరపళ్లలో టాస్క్‌పోర్స్ పోలీసులు శనివారం దాడులు చేపట్టి 22.38లీటర్ల అక్రమ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన కూతల ఆంజనేయులు కిరణం షాప్‌లో 15లీటర్ల లిక్కర్ (రూ.11,129), అశోక్ హోటల్‌లో 7.38 లీటర్ల లిక్కర్ (రూ.8,118) మద్యం బాటిళ్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... బెల్టు షాపులలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన వారిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైన అక్రమంగా మద్యం అమ్మిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

రేపు హోలీ నిర్వహించాలి

నారాయణపేట రూరల్: పండితుల సూచనల మేరకు హైందవ సోదరులు ఈ నెల 24 ఆదివారం రోజున కామదహనం చేసి 25 సోమవారం రోజున హోలీ పండుగను జరుపుకోవాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ధన్వాడ: మండలానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త వేణుగోపాల్ కుమారుడు భరత్‌కుమార్ (20) శుక్రవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందాడు. ఈ విషయం తెలియడంతో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి శనివారం బాధిత కుటుంబానికి పరామర్శించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోస్గి: మండల పరిధిలోని ముంగిమళ్ల వాగు నుంచి అక్రమంగా ఇసుకను చంద్రవంచకు తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకొని కేసున మోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. శనివారం తెల్లవారు జామున వాగునుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో వెళ్లి చూడగా ట్రాక్టర్ పట్టుబడిందని, ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. పట్టుబడిన సంబంధిత ట్రాక్టర్ యజమానిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

• డీఎస్పీ నల్లపు లింగయ్య



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ లింగయ్య

నారాయణపేట: పార్లమెంట్ ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పాత నేరస్తులపై నిఘా ఏర్పాటుచేయాలని డీఎస్పీ నల్లపు లింగయ్య సూచించారు. శనివారం సబ్‌డివిజనల్ పోలీస్ కార్యాలయంలో మక్తల్ సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో పెండింగ్ కేసులపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులపై సీఐ, ఎస్‌ఐలను అడిగి తెలుసుకున్నారు. గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్, ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస్‌ఓపీ ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి కేసులు ఛేదించాలన్నారు. కేసుల్లో శిక్షల శాతం పెంచాలన్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలన్నారు. పూర్తి పారదర్శకంగా కేసులో ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. గంజాయి, గుట్కా, పేకాటపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సమూలంగా నిర్మూలించాలన్నారు. ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి 60 రోజుల్లో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్‌మేంట్ తెలిసి ఉండాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా ఛేదించాలని, కేసుల ఛేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలని, పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకొని ఛాలెంజ్‌గా విధులు నిర్వహించి ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. దొంగతనాల కేసుల్లో ప్రతిరోజూ కేసుల ఛేదనపై అన్ని కోణాల్లో సీసీటీఎన్ఎస్‌లో డాటా ఎంట్రీ మానిటర్ చేయాలని ఎస్‌ఐలకు సూచించారు. దొంగతనాల నిర్మూలనకు రాత్రి పెట్రోలింగ్ అధికారులు పాత నేరస్తులపై నిఘా పెట్టాలన్నారు. విధి నిర్వహణలో రోల్ క్లారిటీ, గోల్ క్లారిటీ ప్రతి ఒక్కరికీ తెలిసి ఉండాలని సూచించారు. అలాగే గ్రామాల పోలీస్ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మమేకమవుతూ సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐలు భాగ్యలక్ష్మి రెడ్డి, శ్రీనివాసులు, నవీద్, అబ్దుల్ ఖాదర్, ఆచారి, స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



దుప్పట్‌గట్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మద్దూరు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మద్దూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైనా భూనీడ్, దుప్పట్‌గట్ గ్రామాల్లో కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ఫ్లాగ్‌మార్చ్ శనివారం నిర్వహించారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటుహక్కును వినియోగించుకోవడానికే ఈ కవాతు నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎస్‌ఐ రాంలాల్ తెలిపారు. ప్రజలకు ఎన్నికలపై అభద్రతభావం లేకుండా భరోసా కల్పిస్తామని ఆయన తెలిపారు.

శిబిరానికి తరలిన కాంగ్రెస్ ఎంపీటీసీలు



మద్దూరు: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 28న జరుగనున్న నేపథ్యంలో కాంగ్రెస్‌కు చెందిన ఎంపీటీసీలు శనివారం బస్సులో క్యాంప్‌కు తరలివెళ్లారు. ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ వెంకట్‌రెడ్డితో పాటు మరో పదిమంది ఎంపీటీసీలు తరలినట్లు మండల అధ్యక్షుడు నర్సింహ తెలిపారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషిచేయాలి



శిక్షణలో మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ రాహుల్

మక్తల్: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో గెలుపునకు కృషిచేయాలని నియోజకవర్గ కో- ఆర్డినేటర్ రాహుల్ అన్నారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బూత్‌లెవల్ ఏజెంట్లకు ఓటరు లిస్టుపై అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ప్రతి ఇంటి ఓటరు తెలిసి ఉండాలని కోరారు. నియోజకవర్గంలో 284 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, మక్తల్‌లో 23 మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రవికుమార్, వెంకటేష్, వడ్డేబాల్‌రాజు, నాగరాజు, రమేష్, బాలస్వామి, శ్రీరామ్, లక్ష్మన్న, రహిమాన్, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



బసిరెడ్డిపల్లిలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్: మండంలోని బసిరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం చక్కగా బోధించిన వారికి గ్రామ పెద్దలు హాజరై బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేర్‌కృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు నరేష్, హన్మంతు, హేమలత, చెన్నమ్మ, మొగులప్ప, మంజుళ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ఫుడ్‌ఫెస్టివల్



నిడుగుర్తిలో ఫుడ్‌ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు చేపట్టిన ఫుడ్‌పెస్టివల్ కార్యక్రమం ఆకట్టుకుంది. ప్రతి నెల నాల్గో శనివారం నో బ్యాగ్‌డే సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వంటకాలను చేసి ప్రదర్శించారు. విద్యార్థులు స్వయంగా పోషకాహారాలు ఉండే వంటకాలను ఇంటివద్ద స్వయంగా తయారు చేసుకొచ్చి ఫుడ్ పెస్టివల్ ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని పలువురు విద్యార్థులను అభినందించారు. హెచ్‌ఎం లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు పద్మ, సునిత, సుజాత, లియాకత్, ఆంజనేయులు, ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు ‘రజాకార్’ చిత్ర ఉచిత ప్రదర్శన

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని మహేశ్వరి థియేటర్‌లో ఆదివారం మధ్యాహ్నం 2గంటల షో ఉచితంగా రజాకార్ చిత్ర ప్రదర్శన ఉంటుందని బీజేపీ మహిళామోర్చ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, పాలమూరు పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ నేతృత్వంలో చిత్రప్రదర్శన ఉంటుందని, ప్రతి ఒక్కరూ సినిమాను చూడాలన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషిచేద్దాం



పేటలో మాట్లాడుతున్న పార్టీ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్



దామరగిద్దలో రక్తదానం చేస్తున్న నాయకులు



కోటకొండలో నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీలో నిర్మాణం చేస్తున్న కొత్త పార్కుకు భగత్‌సింగ్‌పేరు ప్రకటించి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ (ఎంఎల్)మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, జిల్లా నాయకులు కాలేశ్వర్ డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈమేరకు.. వారు మాట్లాడారు.. ప్రారంభానికి ముందే ఆ పార్కులో భగత్‌సింగ్ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కలెక్టర్‌కు కోరుతున్నామన్నారు. పార్టీ నాయకులు, ప్రజా, కార్మిక, విద్యార్థి సంఘాల నాయకులు నరసింహ, ప్రతాప్, కృష్ణ, అంజి, సాయి, గౌస్, వెంకటేష్ పాల్గొన్నారు.

■ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలప్ప, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుండెగారి దస్తప్ప, అంబేద్కర్ జాతర కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్, భవన నిర్మాణం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మన్ పాడ్ బాల్‌రాం తదితరులు పూలమాలవేసి ఘననివాళులర్పించారు.

నారాయణపేట రూరల్ : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని మండలంలోని ఆయాగ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు ముఖ్య అతిథులుగా హాజరై భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరంలో భగత్‌సింగ్ ఎంతో కృషి చేశారని, ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.


ఊట్కూరు: స్వతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషిచేద్దామని సీపీఐఎంఎల్ జిల్లా నాయకులు కిరణ్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు సిద్దు కోరారు. శనివారం మండలంలోని పెద్దజట్రం, బిజ్వార్ గ్రామాల్లో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ..జాతీయ ఉద్యమ వీరుల చరిత్రలను పాఠ్యాంశాలలో చేర్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు సలీం, వెంకట్‌రెడ్డి, ఈశ్వర్, కనకారాయుడు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: స్వతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ వర్ధంతిని మండల కేంద్రంలోని శనివారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలు మాట్లాడుతూ.. నేటి యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. సీపీఎం నాయకులు భరత్‌కుమార్, ఆంజనేయులు, నర్సింహులు, ఎస్ఎఫ్ఐ నాయకులు చిన్న నర్సింహ, సాకేత్, సురేష్, శంకర్, సూర్యప్రకాష్, నరేష్ పాల్గొన్నారు.


మక్తల్: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలోని పీడీఎస్‌యూ, పీవైఎల్, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భాస్కర్ మాట్లాడుతూ .. భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలని దేశంలో సమస్యలపై పోరాటాలను చేయాలని కోరారు. విముక్తి కోసం ఉద్యమించిన మహానేత భగత్‌సింగ్ అని కొనియాడారు. వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎండీ సలీం, ఇఫ్ట్యూ జిల్లా అధ్యక్షుడు కిరణ్, మద్దిలేటి, భగవంతు, సిద్దు, అజయ్, వెంకటేష్, సంధ్య, ఆనంద్, మల్లేష్, మహాదేవి, రఘు తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: స్వాతంత్ర్య భారతదేశం కోసం తమ ప్రాణాలను సైతం లెక్క చేయని గొప్ప నాయకులు షహీద్ భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్‌లు అని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భీమయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకుడు బాల్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి గోపాల్ అన్నారు. శనివారం వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని భగత్‌సింగ్ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. త్యాగధనుల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో తొలగిస్తు భావితరాలను తెలియకుండా చేస్తున్నారన్నారు. దేశ సంపదను కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్తే సమ సమాజ నిర్మాణం ఎలా సాధ్యమవుతుందన్నారు. భగత్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, ఖాజా, మహేష్, జోషి, శివకుమార్, ప్రకాష్, హన్మంతు, మోహన్, అరుణ్, భీంషప్ప, గోవింద్, అంజప్ప పాల్గొన్నారు.


మరికల్: భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్ధంతి సందర్భంగా శనివారం మండలంలోని విశ్వహిందు, భజరంగదళ్ పరిషత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో లక్ష్మీకాంత్‌రెడ్డి, వెంకటేశ్వర్లశర్మ, అనిల్, రవి, రఘు, రవికిరణ్, మల్లేష్ పాల్గొన్నారు.



ఊట్కూర్‌లో..



మాగనూర్‌లో..



మక్తల్‌లో..

రేషన్ సరుకుల నిల్వ కేంద్రం తనిఖీ



నిల్వల వివరాలు తనిఖీ చేస్తున్న తహసీల్దార్

కోస్గి: కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం రేషన్ సరుకుల నిల్వ కేంద్రం (ఎంఎల్ఎస్ పాయింట్)ను తహసీల్దార్ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో నిల్వ ఉన్న సరుకులు, ఆన్‌లైన్‌లో నమోదుచేసిన నిల్వ వివరాలను పరిశీలించారు. సరుకులు పంపిణీచేస్తున్న దుకాణాల వివరాలు, సరఫరా తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్టాక్ పాయింట్ డీటీ హేమ్లా నాయక్, ఆర్ఐ హర్షరెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేలో బీఎల్ఓలు



వివరాలు నమోదు చేస్తున్న బీఎల్ఓ

కోస్గి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రానికి రాలేని వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్ద ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం ఎన్నికల కమీషన్ కల్పించింది. ఈ నేపథ్యంలో శనివారం బీఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహించి నిర్ణీత వయస్సుపై బడ్డ వృద్ధులు, వికలాంగులను గుర్తించి పేర్లు నమోదు చేసుకున్నారు. బీఎల్ఓలు గుర్తించిన వారికి ఫామ్-12-డీ అందజేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. 85 సంవత్సరాల వయస్సు దాటిన వృద్ధులు, వికలాంగులు ఎవరైన ఉంటే ఇంటి దగ్గరే ఓటుహక్కు వినియోగించుకునేందుకు బీఎల్ఓలను సంప్రదించాలని తహసీల్దార్ సూచించారు.

ఉచిత కుట్టుమిషన్ శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శశికళ

మాగనూర్: మాగనూర్, కృష్ణా మండలాల్లో ఎంజీఎన్ఆర్ఈజీఏస్‌లో వందరోజుల పని పూర్తి చేసుకున్న వారికి ఉచిత కుట్టుమిషన్ శిక్షణను ఎస్‌బీఐ, ఆర్ఎస్ఈటీఐ మహబూబ్‌నగర్ వారి ఆధ్వర్యంలో ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ శశికళ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సమావేశ మందిరంలో ఆయా గ్రామాల మహిళలకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు కుట్టు మిషన్ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈ అవకాశన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్‌బీఐ, ఆర్ఎస్ఈటీఐ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆది జగద్గురు రేణుకాచార్య జయంతి



జయంతి ఉత్సవంలో భక్తుల పూజలు

కోస్గి: వీరశైవ మత స్థాపకులు ఆది జగద్గురు రేణుకాచార్య జయంతి ఉత్సవాలను శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మండల వీరశైవ సమాజం, అక్క మహాదేవి మహిళ మండలి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీ భ్రమరాంబసహిత మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో పురోహితులు పాల్గొని ధార్మిక ప్రవచనం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు శశిధర్, సోమశేఖర్, వన్నం పుల్లప్ప, అన్నపూర్ణ, నిర్మలతోపాటు పలువురు వీరశైవ కులస్తులు పాల్గొన్నారు.

సహజ రంగులపై అవగాహన



ముశ్రీఫాలో సహజ రంగుల్ని తయారు చేస్తున్న విద్యార్థులు

కోస్గి: ఆనందాన్ని పంచే హోలీ పండగను ఆరోగ్యకరమైన రంగులతో జరుపుకుందామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ మేరకు శనివారం మండల పరిధిలోని ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ‘ సహజ రంగుల తయారీ-పర్యావరణ హిత హోలీ’ అనే అంశంపై ప్రత్యేక అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హరిత దళ సమన్వయకర్త మల్లేశం విద్యార్థులతో సహజసిద్ధమైన రంగుల్ని తయారు చేయించారు. మార్కెట్‌లో లభించే కృత్రిమ రసాయనిక రంగులతో కలిగే ఆరోగ్య నష్టాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలో హోలీ సంబరాలు



శిశుమందిర్ స్కూల్‌లో హోలీ సంబరాలు

నారాయణపేట రూరల్: మండలంలోని లక్ష్మీపూర్, బసిరెడ్డిపల్లి, ఊటకుంట తండా తదితర ప్రభుత్వ పాఠశాలలో ముందస్తుగా హోలీ సంబరాలు నిర్వహించారు. చిన్నారులతో పర్యావరణ పరిరక్షణ పేరుతో పూవ్వులతో రంగులు తయారు చేయించి హోలీ నిర్వహణ విషయాలను తెలియజేసి, స్వయంగా చేయించారు. అదేవిధంగా పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో చిన్నారులు రంగునీళ్లతో హోలీ నిర్వహించారు. ఒకరికొకరు రంగులు పూసుకుంటు ఆనందంగా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జిల్లా జాతర కమిటీ ఎన్నిక



నారాయణపేట: అంబేద్కర్ రెండో జాతర కమిటీని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్‌లో శనివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మహేష్, ప్రధాన కార్యదర్శిగా పి. ఈశ్వరమ్మ, కో-శాధికారిగా చంటి, అధికార ప్రతినిధి రమేష్, ఉపాధ్యక్షుడిగా హన్మంతు, సిరిగిరి శ్యాంగోపాల్, దుబాయ్ కృష్ణ, బలరాం, పాండు, చిన్నయ్య, శేఖర్, నర్సింహులు, పద్మ, సహాయ కార్యదర్శులుగా గజ్జలప్ప, బాలమణి, బాలరాజ్, రాజు, ఆశప్పను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ.. ఈ జాతరకు సహకరించి పెద్ద ఎత్తున తరలివచ్చి అంబేద్కర్ పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.